వేద విద్వన్మణి త్రిగుళ్ల ప్రభాకరశర్మ ఇకలేరు

- నేడు త్రిగుళ్లలో అంత్యక్రియలు

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): సిద్దిపేట జిల్లా త్రిగుళ్ల గ్రామ వాస్తవ్యుడు బ్రహ్మశ్రీ త్రిగుళ్ల ప్రభాకర్‌శర్మ (84) మృతి చెందారు. హృద్రోగ సంబంధ వ్యాధికి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. సుమారు నాలుగు దశాబ్దాలపాటు ఉపాధ్యాయ వృత్తిలో వందలాది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన ప్రభాకర్‌శర్మ సనాతన వైదిక కార్యక్రమాల్లోనూ నిష్ణాతులు. తన తండ్రి బ్రహ్మశ్రీ రాజమౌళిశర్మ వద్ద సనాతన వైదిక ప్రతిష్ఠ కార్యక్రమాలను అభ్యసించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని అనేక దేవాలయాల్లో వందకుపైగా ప్రతిష్ఠాపనలు నిర్వహించి ధర్మవ్యాప్తికి దోహదపడ్డారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తరాల ద్వారా వచ్చే అనేక ధర్మ సందేహాలకు తన అనుభవంతో ఉచితమైన, శాస్త్ర ఆధారమైన సలహాలు ఇచ్చేవారు. పరంపరగా వస్తున్న గురుసేవలో భాగంగా మర్కూక్ పాండురంగ ఆశ్రమంలో జరిగే అన్ని విశేష కార్యక్రమాల్లోనూ సేవలందించారు. శర్మకు భార్య, కూతురు, నలుగురు కుమారులు ఉన్నారు. గురువారం త్రిగుళ్లలో ప్రభాకర్‌శర్మ పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

మున్నేరు ముంపువాసులను ఆదుకోవాలి

- కుటుంబానికి 3 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి
- అఖిలపక్ష నేతల డిమాండ్
- ఖమ్మం అర్బన్ తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా

రఘునాథపాలెం, అక్టోబర్ 16: మున్నేరు ముంపు ప్రాంత ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ, ఎంఎల్ మాస్‌లైన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ, సీపీఎం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు, ఎర్ర శ్రీకాంత్ మాట్లాడుతూ మున్నేరు వరద ప్రవాహంతో ముంపు ప్రజలు సర్వస్వాన్ని కోల్పోయారని తెలిపారు. అనేక ఇండ్లు కొట్టుకుపోయాయని, పలు ఇండ్లు ధ్వంసమైనట్టు పేర్కొన్నారు. వరదలు వచ్చి రెండునెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు ఏ మాత్రం ఆర్థికసాయం అందలేదని మండిపడ్డారు. కంటితుడుపు చర్యగా కొంతమందికి రూ.16,500 అకౌంట్లో జమ చేసి చేతులు దులుపుకొన్నట్టు విమర్శించారు. సర్వే చేసిన జాబితా గల్లంతు కావడంతో అర్హులైన వందల మంది నిరుపేద బాధితులకు పరిహారం నేటికీ అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముంపునకు గురైన ప్రతి కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.

మీ స్వార్థానికి రాష్ట్రంపై అప్పులా?

➤ మొదటిపేజీ తరువాయి...

కోసం 3ఏ ద్వారా నోటిఫికేషన్లు ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు పూర్తయినా భూసేకరణ ముందుకు సాగడంలేదని, దీనిపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగంలో యుద్ధ ప్రాతిపదికన మార్కెట్ విలువ ప్రకారం రైతులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

182 నుంచి 198 కిలోమీటర్లకు పెంపు

దక్షిణ భాగం అలైన్‌మెంట్ 182 కిలోమీటర్ల ప్రతిపాదనలతో ఐసీటీ సంస్థ నివేదిక ఇచ్చిందని హరీశ్ వివరించారు. కాంగ్రెస్ వచ్చాక సీఎం, ఆయన అనుచరులు, ముఖ్యుల కోసం ఈ అలైన్‌మెంట్‌ను పూర్తిగా మార్చారని, దీంతో అది కాస్తా 198 కిలోమీటర్లకు పెరిగిందని చెప్పారు. ఇందులో ప్రముఖుల భూములు ఉన్నాయని తెలిపారు. ఒక్కసారి ఫైనల్ చేసిన అలైన్‌మెంట్‌ను మార్చేందుకు జాతీయ రహదారుల సంస్థ ఒప్పుకోదని, ఈ విషయం తెలిసీ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ సర్కార్ అలైన్‌మెంట్ మార్చిందని ధ్వజమెత్తారు. దీనికి కేంద్రం ఒప్పుకోకుంటే రాష్ట్రంపైనే నిధుల భారం పడుతుందని స్పష్టంచేశారు.

ఉన్న ఒక్క చీర కూడా పోయింది

కాంగ్రెస్ అధికారంలోకొస్తే రెండు చీరలు ఇస్తామన్న రేవంత్‌రెడ్డి ఈ సారి బతుకమ్మకు ఒక్క చీర కూడా ఇవ్వలేదని హరీశ్ మండిపడ్డారు. రైతుబంధు రూ.15వేలు ఇస్తామని చెప్పి వానకాలం పంటకు రూపాయి కూడా వేయలేదని, కేసీఆర్ కిట్ బంద్ చేశారని విమర్శించారు. చెరువుల్లో చేప పిల్లలు వదలడం లేదని, గొర్రెల పంపిణీ చేయడం లేదని కాంగ్రెస్ చెప్పిన మార్పు అంటే ఇదేనా? అని ఎద్దేవా చేశారు. ఫిషరీష్ కమిషనర్ సగం మాత్రమే చేప పిల్లలు పంపిణీ



చేయాలని అధికారికంగా ఆదేశాలు జారీ చేశారని, చెరువులు పూర్తిగా నిండినా సగం చేపపిల్లలే సరఫరా చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆగస్టులో పోయాల్సిన చేప పిల్లలను అక్టోబర్ వచ్చినా పోయలేదని చెప్పారు. చేప పిల్లల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.150 కోట్లు ఖర్చు చేస్తే

> మహిళలకు రెండు బతుకమ్మ చీరలు ఇస్తమని కాంగ్రెస్ చెప్పింది. ఇప్పుడు ఉన్న చీర కూడా పోయింది. పండుగ పూట ఆడబిడ్డలకు సంతోషమే లేకుండా జేసిండ్రు.. ఇదేనా మార్పు అంటే -హరీశ్‌రావు

కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌లో పెట్టింది కేవలం రూ.16 కోట్లేనని గుర్తుచేశారు.

ఏసీడీపీ నిధులేవి ?

ఆర్థిక సంవత్సరం ఏడు నెలలైనా ఇంత వరకు నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఎందుకు విడుదల చేయలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సంవత్సరానికి రూ.5 కోట్ల చొప్పున కేటాయిస్తామని బడ్జెట్ ప్రతిపాదించారని కానీ ఇంత వరకు జీవో కూడా విడుదల కాలేదని తెలిపారు. ప్రజాపాలన అని గొప్పగా చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో పొందుపర్చిన విధంగా ఎందుకు విడుదల చేయడంలేదని నిలదీశారు.

మెడికల్ సీట్లలో తెలంగాణ అగ్రస్థానం

మెడికల్ సీట్లలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానానికి చేరిందని హరీశ్‌రావు తెలిపారు. తొమ్మిదేండ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వైద్యవిద్యకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ నిలిచిందని బుధవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. నాడు అందని ద్రాక్షగా ఉన్న వైద్య విద్య, నేడు సాధారణ ప్రజలకు చేరువైందని వివరించారు. ఉమ్మడి పాలనలో ఐదు మెడికల్ కాలేజీలు ఉంటే, బీఆర్‌ఎస్ 34 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందని, 2014 వరకు తెలంగాణలో 2,850 ఎంబీబీఎస్ సీట్లు ఉంటే నేడు 8,490 సీట్లకు చేరాయని గుర్తుచేశారు. ఇది కేసీఆర్ మార్క్ పాలన అని, మార్పు పేరు చెప్పి ఎవరూ చెరిపేయలేరని ఇది ఆల్‌టైం రికార్డు అని స్పష్టంచేశారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న సర్కారు

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పుల విషయంలో రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క విడుదల చేసిన అప్పుల ప్రకటనను ఖండిస్తున్నట్టు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.49,618 కోట్ల అప్పు తీసుకున్నదని ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రకటనలో పేర్కొన్నారని తెలిపారు. అయితే, 2024 జూలై 26న అసెంబ్లీలో ఓ ప్రశ్నకు సమాధానంగా, ప్రభుత్వం రూ.24,887.71 కోట్ల ప్రభుత్వరంగ సంస్థల రుణాలకు హామీ ఇచ్చినట్టు వెల్లడించారని హరీశ్‌రావు తెలిపారు. టెస్కాబ్, ఎన్‌సీడీసీ నుంచి మరో రూ.5 వేల కోట్ల రుణాన్ని అదనంగా పొందినట్టు పేర్కొన్నారు. ఇవన్నీ కలిపి కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల్లో తీసుకున్న మొత్తం రుణం రూ.80 వేల కోట్లుగా ఉన్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా నెరవేర్చని, మోసపూరిత హామీలు చాలా ఉన్నాయని వాటిని నంబర్లతో సహా వివరించారు.

- **రైతు రుణమాఫీ:** రూ.17,809 కోట్లు మాత్రమే విడుదల చేశారని, 50% లోపు లబ్ధిదారులకే అవి చేరాయని, 22 లక్షల కంటే ఎక్కువ మంది రైతులు రుణమాఫీ కాలేదని తెలిపారు.
- **రైతు భరోసా:** ఇంకా ప్రారంభం కానేలేదు.
- **కల్యాణ లక్ష్మి:** తులం బంగారం ఊసే లేదు.
- **ఉచిత విద్యుత్తు:** 50% లోపు తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకే ప్రయోజనం అందుతున్నది.
- **మహాలక్ష్మి పథకం:** 18 ఏళ్ల పైబడ్డ మహిళలకు ₹2,500 సాయం పెండింగ్‌లో ఉన్నది.
- **ఔట్ సోర్సింగ్/కాంట్రాక్ట్ ఉద్యోగులు:** పలు విభాగాలలో 3-6 నెలల నుంచి వేతనాలు అందడం లేదు.
- **చేయూత:** ప్రారంభం కాలేదు.
- **ఆసరా పెన్షన్:** అనేక జిల్లాల్లో 2 నెలల పెండింగ్
- **రెసిడెన్షియల్ పాఠశాలలు:** 9 నెలల అద్దె బకాయిలు పెండింగ్

రేవంత్ తెచ్చిన అప్పు 80,500 కోట్లు

- 10 నెలల్లోనే రికార్డుస్థాయిలో రుణాలు
- అప్పు- తప్పు అన్నోళ్లని దేనితో కొట్టాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీ ఎక్కిన నాటి నుంచి ఇప్పటివరకు తెచ్చిన అప్పులు రూ.80,500 కోట్లు అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. నాడు అప్పు-తప్పు అన్నోళ్లను ఇప్పుడు దేనితో కొట్టాలి? అని నిలదీశారు. ఎన్నికల హామీలేవీ తీర్చలేదు.. ఏ కొత్త సాగునీటి ప్రాజెక్టు కట్టలేదు? మరి ముఖ్యమంత్రి తెస్తున్న అప్పు ఏమైనట్టు? 80వేల కోట్ల ధనం ఎవరి జేబుల్లోకి వెళ్లినట్టు? అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్ల బిల్లులకే ధారాదత్తం చేస్తున్నారా? కమీషన్ల కోసం కక్కుర్తి పడే అప్పులు తెస్తున్నారా? అప్పు.. శుద్ధ తప్పు అని ప్రచారంలో ఊదరగొట్టి అవే అప్పుల కోసం ముఖ్యమంత్రి పాకులాడటమేంటి? అని ఎక్స్ వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. బీఆర్‌ఎస్ హయాంలో అప్పులు తీసుకొని ప్రాజెక్టులు కట్టామని, ప్రతిపైసాతో మౌలిక సదుపాయాలు పెంచామని, దశాబ్దాల ప్రజల కష్టాలు తీర్చామని వెల్లడించారు. కానీ, ముఖ్యమంత్రి తెస్తున్న అప్పుల 'అడ్రస్' ఎక్కడ? అని నిలదీశారు. రాష్ట్ర సంపదను సృష్టించడానికి కాకుండా సొంత ఆస్తులు పెంచుకోవడానికి అప్పులు చేయడం క్షమించరాని నేరమని, రాష్ట్ర భవిష్యత్తుకు ప్రమాదమని కేటీఆర్ హెచ్చరించారు.

మూలధన ఖర్చు రూ.21,881 కోట్లే..

- డిప్యూటీ సీఎం కార్యాలయం వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్ నుంచి సోమవారం(15వ తేదీ) వరకు రూ.21,881 కోట్లను మాత్రమే మూలధన వ్యయం కింద ఖర్చుచేసిందని డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇప్పటి వరకు రూ.49,618 కోట్లను అప్పుగా తీసుకున్నట్టు పేర్కొన్నది. అప్పులు, వడ్డీ కింద రూ.56,440 కోట్లను తిరిగి చెల్లించినట్టు ప్రకటించింది. రూ.54,346 కోట్లను వివిధ పథకాల కోసం ఖర్చు చేసినట్టు తెలిపింది.

కనకపు సింహాసనమున కూర్చున్నాక
కనకం హామీని మర్చిపోయినవా?

బంగారు గనుల్లో తవ్వకాలు ఆగిపోయినయా? • గోల్డ్ షాపుల్లో స్టాక్ అయిపోయిందా?

కల్యాణ లక్ష్మిలో తులంబంగారం ఎప్పడిస్తరు? • సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): 'కనకపు సింహాసనమున కూర్చున్నాక.. కనకం హామీని మర్చిపోయినవా?' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 'లక్షలాదిగా లగ్గాలు జరిగే సీజన్ మళ్లీ వచ్చింది.. ఈ సారి కూడా తులం బంగారం తూచేనా ముఖ్యమంత్రి' అంటూ ఎద్దేవాచేశారు. 'శుభ ముహూర్తాలతో పెళ్లి సందడి మొదలైంది.. కల్యాణమస్తు కానుక అమలుకు సుముహూర్తం దొరకట్లేదా?' అంటూ బుధవారం ఎక్స్‌వేదికగా ప్రశ్నించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో తులం బంగారం హామీ గురించి ప్రస్తావిస్తూ '10 గ్రాముల పసిడి ఆశజూపి ఆడబిడ్డల ఓట్లు వేయించుకున్నవ్.. ఆడిన మాట తప్పి పచ్చని పందిళ్ల సాక్షిగా పచ్చిదగా చేస్తున్నవ్' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'లంకె బిందెలు దొరకలేదన్న నైరాశ్యంతో నవ వధువులకు ఇవ్వాల్సిన పుత్తడిని ఎగ్గొట్టడం భావ్యమా?' అంటూ ప్రశ్నించారు. 'పేదింటి పెండ్లి కూతుళ్లకు టన్నుల కొద్దీ గోల్డ్ బాకీ పడ్డవ్.. ఒలింపిక్స్‌లో మోసాల పోటీలు పెడితే నీకు గోల్డ్‌మెడల్ గ్యారెంటీ.. గట్టి మేళాలు మోగుతున్నయ్.. వట్టి మాటలు ఇంకెన్నాళ్లు? గోల్డ్ షాపుల్లో స్టాక్ లేదా? బంగారు గనుల్లో తవ్వకాలు ఆగిపోయినయా?' అంటూ దెప్పిపొడిచారు. వాగ్దానం చేసి వంచించడం మంచిది కాదని, ఆడబిడ్డలు బాధపడితే అరిష్టమని, ఈ సీజన్‌లోనైనా తులం బంగారం పథకాన్ని ప్రారంభించాలని కేటీఆర్ సూచించారు.

నకిలీ విత్తనాలకు ఆగిన రైతు గుండె

- పంట నష్టపోవడంతో మనస్తాపం

పర్వతగిరి, అక్టోబర్ 16 : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చౌటపెల్లి గ్రామంలో ఓ రైతు గుండె బుధవారం ఆగింది. గ్రామానికి చెందిన రైతు గుర్రం నర్సయ్య (62) పర్వతగిరిలో ధరణి ఫర్టిలైజర్స్ యజమాని వద్ద సూపర్ సీడ్ కంపెనీకి చెందిన వరి విత్తనాలు కొనుగోలు చేశాడు. వాటిని తన కున్న ఎకరం పొలంతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుచేశాడు. పంట దిగుబడి రాకపోవడంతో రెండు రోజులుగా మదనపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతిచెందాడు. నర్సయ్య కొనుగోలు చేసిన వరి విత్తనాలు నకిలీవని తేలిందని, సదరు కంపెనీపై చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్లు మండల వ్యవసాయాధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

ఈ ఏడాదిలోనే రుణమాఫీ పూర్తి చేస్తాం

- తెల్లరేషన్‌కార్డు లేని వాళ్లకు ఈ నెలలోనే మాఫీ
- 2లక్షలకుపైన ఉన్న వారికి త్వరలో షెడ్యూల్: తుమ్మల

నల్లగొండ, అక్టోబర్ 16 : ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఈ ఏడాదిలోనే రూ.31 వేల కోట్ల రైతు రుణమాఫీని పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్ర శివారులోని బత్తాయి మార్కెట్‌లో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెల్ల కార్డు లేని కారణంగా ఆగిన నాలుగు లక్షల మంది రైతులకు ఈ నెలలోనే రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. రెండు లక్షలకుపైగా ఉన్న రుణాలకు సంబంధించి కూడా మాఫీ కోసం ప్రయత్నం చేస్తున్నామని, అందుకోసం త్వరలో షెడ్యూల్ ప్రకటిస్తామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఈ పంట కాలానికి రైతు భరోసా కూడా అందజేస్తామని చెప్పారు. సన్నాలు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చి.. వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం ఇవ్వనున్నట్టు తెలిపారు.

చేతికొచ్చిన పత్తి కొనేది ఎప్పుడో?

- ప్రారంభమైన దిగుబడులు
- కొనుగోళ్లు లేక ఇండ్లల్లోనే నిల్వలు
- తెరుచుకోని సీసీఐ కేంద్రాలు

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో పత్తి ఏరుతున్న కూలీలు, తాంసి మండలం పొన్నారిలో రైతుల ఇండ్లలో పత్తి నిల్వలు

ఆదిలాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో పత్తి దిగుబడులు వస్తున్నా ఇంకా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ కేంద్రాలు తెరుచుకోకపోవడంతో రైతులు పత్తిని ఇండ్లల్లోనే నిల్వ చేసుకోవాల్సి వచ్చింది. ఆదిలాబాద్ జిల్లాలో తెల్లబంగారం సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతున్నది. 2022లో 3,83,251 ఎకరాలు, 2023లో 4,12,436 ఎకరాలు, ఈ వానకాలంలో 4,33,547 ఎకరాల్లో పత్తి సాగైంది. ఏటా జూన్ మొదటివారంలో రైతులు పత్తి విత్తనాలు వేస్తారు. జనవరి వరకు దిగుబడులు పూర్తి అవుతుండగా.. అక్టోబర్ రెండో వారంలో పంటను ఏరడం ప్రారంభిస్తారు. జూన్ మొదటి వారంలో వేసిన పత్తి దిగుబడులు చేతికొచ్చినా కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాలేదు. అధికారులు పది రోజుల కిందట సీసీఐ, ప్రైవేటు వ్యాపారులు, ట్రాన్స్‌పోర్టర్లతో సమావేశం ఏర్పాటు చేసినా కొనుగోళ్లు ప్రారంభించే తేదీని నిర్ణయించలేదు. ఈ ఏడాది ఎకరాకు పది క్వింటాళ్ల వరకు పంట చేతికొచ్చే అవకాశాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాల్‌కు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. జిల్లావ్యాప్తంగా 32 లక్షల క్వింటాళ్ల పంట విక్రయానికి వస్తుందని అంచనా వేసిన అధికారులు రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రకటించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో రెండు, బోథ్, సోనాల, నేరడిగొండ, పొచ్చెర, ఇంద్రవెల్లి, నార్నూర్, ఇచ్చోడ, గాదిగూడ, గుడిహత్నూర్, సిరికొండ, జైనథ్, బేలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు.

ప్రైవేటు వ్యాపారుల భయం

ప్రభుత్వ కొనుగోళ్లు లేకపోవడంతో రైతులు పంటను ఇండ్లలోనే నిల్వ చేసుకుంటున్నారు. ప్రైవేటు వ్యాపారులతోపాటు మహారాష్ట్రకు చెందిన దళారులు రైతుల అవకాశాన్ని ఆసరాగా చేసుకుని తక్కువ ధరకు కొనుగోలు చేసే ప్రమాదం ఉన్నది. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521 ఉండగా.. దళారులు క్వింటాల్‌కు రూ.7 వేల వరకు చెల్లిస్తారు. దీంతో రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉన్నది. కొనుగోలు చేసిన దళారులు డబ్బులను వాయిదాల పద్ధతిలో చెల్లిస్తారు. డబ్బులు ఇస్తారో ఎగకొడుతారో తెలియదు. పత్తి కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి పంటను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కూలీలకు ఇవ్వడానికి డబ్బులు లేవు

ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం పత్తి కొనుగోళ్లు ప్రారంభించక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే రైతుబంధు, అందరికీ రుణమాఫీ కాకపోవడంతో రైతులు అవస్థలు పడుతుండగా.. పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాక చేతిలో చిల్లి గవ్వ లేకుండాపోయింది. పత్తి తీసిన కూలీలకు డబ్బులు ఇవ్వడానికి అప్పు చేయాల్సి వస్తున్నది. మార్కెట్ యార్డుల్లో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభంకాక పోవడంతో రైతులు మహారాష్ట్ర దళారులకు పంటను విక్రయించే పరిస్థితులు ఉన్నాయి.

- గడ్డం లస్మన్న, రైతు, పిప్పల్‌కోటి, భీంపూర్ మండలం

ఇంట్లో నిల్వ చేసుకున్నా

వారం రోజుల నుంచి పత్తి తీయడం ప్రారంభమైంది. నేను మూడు ఎకరాల్లో పంట సాగు చేయగా 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అమ్మడానికి ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకుపోదామంటే కొనుగోళ్లు ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో ఇంట్లో నిల్వ చేశా. అధికారులు వెంటనే సీసీఐ కేంద్రాలను ప్రారంభించి పంటను సేకరించాలి. లేకపోతే దళారులకు అమ్మి నష్టపోయే ప్రమాదం ఉన్నది.

- దొంతుల రాజు, రైతు, పొన్నారి, తాంసి మండలం

'కొనుగోలు' డ్రామా!

- ఆర్భాటంగా పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం
- మంత్రులు వెళ్లగానే తెచ్చిన పత్తిని తీసుకెళ్లిన రైతు

మంత్రులు వెళ్లిన అనంతరం పత్తిని తిరిగి వాహనంలో తీసుకెళ్తున్న రైతు

నల్లగొండ, అక్టోబర్ 16: నల్లగొండ బత్తాయి మార్కెట్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం ఎంతో ఆర్భాటంగా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తమ మేలు కోరి మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చారని సంతోషపడిన రైతులు.. అరగంట తర్వాత తెల్లబోయారు. ప్రారంభించిన అర గంటకే కొనుగోలు కేంద్రాన్ని ఎత్తేయడంతో అందరూ కంగుతిన్నారు. అసలు సెంటరే లేని ప్రాంతంలో మినీ మాక్సీ వాహనంలో నాలుగైదు క్వింటాళ్ల పత్తిని తెప్పించి కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్టు మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి ఫొటోలకు ఫోజులు ఇచ్చి పత్తి రైతులను బురిడీ కొట్టించారు. నల్లగొండ జిల్లా కేంద్రం శివారులోని ఎస్‌ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్‌లో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు మంత్రులు హాజరవుతున్నారని ఒకరోజు ముందే అధికారులు ఫ్లెక్సీలు, ప్రకటనలతో హోరెత్తించారు. బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఇద్దరు మంత్రులు ప్రారంభించి వెళ్లారు. ఆ తర్వాత కొద్దిసేపటికే కనగల్‌కు చెందిన రైతు తాను తీసుకొచ్చిన పత్తిని తిరిగి వాహనంలో వేసుకుని వెళ్లాడు. కేవలం పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం కోసమే తీసుకొచ్చాడని తెలిసి మిగతా రైతులు ముక్కున వేలేసుకున్నారు. నల్లగొండ జిల్లాలో 24 జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు కొనుగోళ్లకు టెండర్లు వేశాయి. వాటిని ఇప్పటి వరకు సీసీఐ ఇన్‌స్టలేషన్ చేయకుండా పెండింగ్‌లోనే ఉంచింది. వారి పని పూర్తయితే గానీ మార్కెటింగ్ యంత్రాంగం అప్రూవల్ ఇవ్వదు. కొనుగోలు కేంద్రాల ఎంపిక సీసీఐ వద్ద పెండింగ్‌లో ఉండగా.. మంత్రులు మాత్రం ఉత్తుత్తి కేంద్రం ప్రారంభించి పత్తి కొనుగోలు చేస్తున్నట్టు హైడ్రామా చేయడం విడ్డూరంగా ఉందని చర్చ సాగుతున్నది.

తెలంగాణ భవన్‌లో బుధవారం మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో రజనీసాయిచంద్, కురువ విజయ్

తెలంగాణది తెల్ల బంగారమే.. అయినా గుజరాత్ పత్తికే మద్దతు!

- రాష్ట్రంలోనూ అదే మద్దతు ధర ఇవ్వాలి
- పడిపోయిన పత్తి ధర.. పట్టింపులేని ప్రభుత్వం
- సీసీఐ కొనుగోలు కేంద్రం ఒక్కటీ లేదు
- ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఎందుకు?
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): పత్తి మద్దతు ధరలోనూ తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పండే పత్తి మేలైన రకమని సీసీఐ చైర్మన్ గతంలో చెప్పారని, కానీ గుజరాత్ పత్తికి తెలంగాణ పత్తి కంటే అధికంగా మద్దతు ధర ప్రకటించారని ఆయన విమర్శించారు. గుజరాత్‌లో పత్తికి మద్దతు క్వింటాకు రూ.8257 ఉంటే తెలంగాణ రైతుకు రూ.7521 మాత్రమే ఎందుకు అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పత్తి ధర పడిపోయినా ప్రభుత్వం స్పందించడం లేదని, సీసీఐ ఒక్క కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించలేదని ఆయన ఆరోపించారు. గుజరాత్‌లో క్వింటాలు పత్తికి ఇస్తున్న మద్దతు ధర తెలంగాణ రైతులకూ ఇవ్వాలని డిమాండ్ చేశారు.దీనిపై రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు స్పందించాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

మేధావులు ఏమయ్యారు...?

రాష్ట్రంలో 2.5కోట్ల మంది ఆధారపడ్డ వ్యవసాయ రంగంపై ముఖ్యమంత్రికి బాధ్యత లేదా ? అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. రైతుబంధు జాడలేదని, క్వింటాలుకు రూ.500 వడ్ల బోనస్ ఊసులేదని విమర్శించారు. పేదల ఇండ్లు కూల్చడమే ఈ ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యతా..? అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం మీద ఒంటికాలితోలేచిన మేధావులు ఇప్పుడెందుకు నోరుమూసుకున్నారని నిలదీశారు. ఈ మీడియా సమావేశంలో మాజీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్, బీఆర్‌ఎస్ నేత కురువ విజయ్ పాల్గొన్నారు.

వచ్చేఏడాదిలోగా ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

- త్వరితగతిన నక్కలగండి ప్రాజెక్ట్‌పనులు: ఉత్తమ్

హైదరాబాద్, అక్టోబర్16 (నమస్తే తెలంగాణ): వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్ పనులను పూర్తిచేయాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మిర్యాలగూడ నియోజకవర్గాల్లోని ప్రాజెక్టులపై ఉన్నతాధికారులతో జలసౌధలో బుధవారం ప్రత్యేకంగా సమీక్షించారు. మొత్తం 44 కి.మీ, ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో ఇంకా 9.5 కీమీ టన్నెల్ బోరింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. పనుల పూర్తికి అవసరమైన కీలక యంత్రాలను దిగుమతి చేసుకోవాలని, టన్నెల్ పూర్తయితే దాదాపు రూ.200 కోట్ల మేరకు లిఫ్టింగ్ ఖర్చులను ఆదా చేయవచ్చని తెలిపారు. నక్కలగండ ప్రాజెక్ట్ కూడా వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల పురోగతిపైనా సమీక్షించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బాలునాయక్, బీ లక్ష్మారెడ్డి, నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఎల్‌ఏ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.